# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అనకాపల్లిలో వెయ్యి మెగా వాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర సహాయ మంత్రి తోకన్ సాహు స్పష్టం చేశారు.
- కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభించనున్నారు.
- రాష్ట్ర శాసనసభ పిటిషన్స్ కమిటీ ఈరోజు విశాఖపట్టణంలో పర్యటించింది.

======================

అనకాపల్లిలో వెయ్యి మెగా వాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో ఈరోజు సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డ్ (SIPB) సమావేశంలో వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి మంత్రివర్గ నిర్ణయాలను పాత్రికేయులకు వెల్లడించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. పెట్టుబడుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందు చూపుతో వెళ్తోందన్నారు. క్లస్టర్ విధానంలో అనుబంధ పరిశ్రమలన్నీ ఒకే చోట ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

అదే విధంగా జులై మూడో తేదీన కడప స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు సైతం మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. సుమారు 11 సంస్థలు అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

======================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోకన్ సాహు స్పష్టం చేశారు. రాజధాని అమరావతికి విచ్చేసిన తోకన్ సాహుతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈరోజు సమావేశమయ్యారు. అమరావతిలోని సీఆర్డీయే కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్రంలో మున్సిపల్, హౌసింగ్ శాఖల్లో అమలవుతున్న పథకాల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితి, మెప్మాలో అమలవుతున్న పథకాలు, ఎలక్ట్రిక్ బస్సులు, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై అధికారులు ప్రెజెంటేషన్ ఇచ్చారు. రాజధాని అమరావతి నిర్మాణంలో ముఖ్యమంత్రి దార్శనికతను కేంద్రమంత్రి ఈ సందర్భంగా కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వేగంగా జరుగుతోందని కేంద్రమంత్రి తెలియజేశారు.

======================

కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవంతో పాటూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా రేపు ఉదయం 11 గంటల 45 నిమిషాలకు జొన్నగిరిలో ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి… అనంతరం జియో మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు 405 కోట్ల రూపాయల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జొన్నగిరి బంగారం శుద్ధి కర్మాగారాన్ని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ…

(వాయిస్ 21 సెకన్లు)

విరామం

======================

పల్స్ పోలియో కార్యక్రమం ఈనెల 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జరగనుంది. పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టింది. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కాకినాడ జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీతో కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన ఈరోజు సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్, విద్య, డీఆర్డీఏ, ఐసీడీఎస్, పరిశ్రమలు, ప్రజా రవాణా శాఖల అధికారులకు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ఈ సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు.

======================

ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం ఈ నెల 30వ తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ విజయవాడలోని లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ను ఈరోజు కలిసి స్నాతకోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. విశ్వ విద్యాలయంలో జరుగుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రొఫెసర్ ఈ సమావేశంలో గవర్నర్ కి వివరించారు. విశ్వవిద్యాలయం అందిస్తున్న జాబ్ ఒరియెంటెడ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ కార్యక్రమాలు, సమాజ అనుసంధాన కార్యక్రమాల గురించి తెలియజేశారు. అదే విధంగా జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి – 2020) లక్ష్యాలకు అనుగుణంగా 2023–24 విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలో పలు విద్యా కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయం కార్యక్రమాలు ముఖ్యంగా గిరిజన సమాజ అభ్యున్నతి, సాధికారత, సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు.

======================

ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర శాసనసభ పిటిషన్స్ కమిటీ నిర్వహించిన సమావేశం అత్యంత ఫలప్రదంగా సాగిందని కమిటీ చైర్మన్ కె. రఘురామకృష్ణం రాజు తెలిపారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై స్థానిక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు సమర్పించిన 14 పిటిషన్లను సమావేశంలో సవివరంగా పరిశీలించి.. సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు. విశాఖ కలెక్టరేట్ మీటింగ్ హాలులో అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి వివరించారు. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలను గుర్తించడంతో పాటు.. వాటి అమలుకు నిర్దిష్ట కాలపరిమితులను నిర్ణయించడం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఎంత సమయం అవసరమో, ఏ శాఖ ఏ విధంగా చర్యలు చేపట్టాలో, అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించాల్సిన బాధ్యతలపై ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు రఘురామకృష్ణం రాజు తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

`నషా ముక్త్ భారత్ సప్తాహ్` కార్యక్రమంలో భాగంగా కళాజాతర బృందంతో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఈరోజు కళా ప్రదర్శనలు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడం, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడడం, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు పార్వతీపురం రూరల్ పోలీస్ సిబ్బంది ఈగల్ టీంతో కలిసి వెంకంపేట గ్రామ ప్రజలకు, విద్యార్థులకు కళా ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలను వివరించి డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

======================
======================